
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 2 డిసెంబరు 2024
5





ఇల్లెందులో భారీ ఊరేగింపు

వైభవంగా ఉర్సేషరీఫ్

- కన్నుల పండువలా జులూస్
- ఇల్లెందులో వెల్లివిరిసిన మత సామరస్యం
- పలు జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు

మత సామరస్యం వెల్లి విరిసే.. హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్ దర్గా షరీఫ్ 22వ ఉర్సు మహోత్సవాలు ఆదివారం ఇల్లెందులో వైభవంగా జరిగాయి. ఏటా వైభవంగా నిర్వహించే ఉర్సు షరీఫ్ ఉత్సవాలు శనివారం సందల్ కార్యక్రమంతో ప్రారంభమై ఆదివారం రాత్రి కవ్వాలి వేడుకలతో ముగిశాయి.

- ఆంధ్రజ్యోతి, ఇల్లెందు



జులూస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కందిలి

సరుకు రవాణా మరింత చౌకగా అవుతుందనే భావనతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందనే ఆకాంక్షతో గతంలో గోదావరిపై జాతీయ జల మార్గానికి కేంద్రప్రభుత్వం ఆమోద ముద్రవేసింది. దాంతో ఈ జాతీయ జలమార్గం పనులు వేగంగా సాగుతాయని అందరూ భావించారు. కానీ పన్నెండేళ్లు గడుస్తున్నా.. ఈ ప్రతిపాదన సర్వేకే పరిమితమైంది. ప్రజాప్రతినిధులు ఈ జలమార్గం విషయాన్ని అప్పుడప్పుడు ప్రస్తావించడం మినహా ఎటువంటి పురోగతి లేకపోవడంతో అసలు ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చుతుందా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరి జలమార్గం పట్ల ఎంతో ఆసక్తి కనబర్చి ఈ విషయమై కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని పలుమార్లు కోరారు. అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి కదలికలేకపోవడం పట్ల ఏజెన్సీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుక్కునూరు గోదావరి పరివాహక ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

సర్వేతోనే.. సరిపెట్టారు!

- పన్నెండేళ్లుగా ముందుకు సాగని గోదావరి జలమార్గం
- రాజమండ్రి టూ నాసిక్ మార్గానికి గతంలో ఆమోదం
- ఆ తరువాత దాని ఊసే మరిచిన కేంద్ర ప్రభుత్వం
- నిర్మాణం పూర్తయితే సులభతరం కానున్న సరుకురవాణా

భద్రాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి నుంచి నాసిక్ వయా భద్రాచలం జలమార్గానికి గతంలోనే కేంద్రం ఆమోదం తెలిపినా దశాబ్దాల కాలంగా ఈ ప్రాజెక్టు ముందుకు సాగడం లేదు. 2013లో జాతీయ జలమార్గ రవాణా పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం భద్రాచలం-రాజమండ్రి (171 కి.మీ.), భద్రాచలం-నాసిక్(1,184కి.మీ.)మధ్య జల రవాణాకు ఆమోదం తెలిపింది. అనంతరం దీనిపై ఎటువంటి కదలిక లేకపోవడం గమనార్హం. ఈ జల మార్గం పూర్తి చేస్తే సులభతరంగా సరుకు రవాణా చేయడమే కాకుండా ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే రోడ్డు రవాణాతో పోలిస్తే జలరవాణకు ఖర్చు తక్కువ అవుతుందనే అభిప్రాయం ఉండడంతో ప్రభుత్వం ఇందుకు చొరవ తీసుకోవాల్సి ఉన్నా.. ఆ దిశగా కసరత్తు చేయకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఐదున్నర దశాబ్దాల క్రితమే బీజం..

ఐదున్నర దశాబ్దాల క్రితం భద్రాచలం ఏజెన్సీ దట్టమైన అటవీ ప్రాంతం.. నిత్యావసర, అత్యవసర సరుకులు లభించాలన్నా, వైద్యం అందాలన్నా.. గోదావరి మార్గం ద్వారా ప్రయాణం చేస్తేనే పరిష్కారం లభించేది. దీంతో ప్రతిరోజు రాజమండ్రి నుంచి లాంచీలు రాకపోకలు సాగించేవి. ఇందుకోసం ఒక్కొక్క ప్రయాణికుడి వద్ద భద్రాచలం నుంచి రాజమండ్రి వెళ్లేందుకు రూ.3 నుంచి రూ.5 వసూలు చేసేవారు. ఆదేవిధంగా చింతూరు-రాజమండ్రి, కుంట-రాజమండ్రి, కూనవరం-రాజమండ్రి, భద్రాచలం-దుమ్ముగూడెం, దుమ్ముగూడెం-వెంకటాపురానికి లాంచీ ప్రయాణాలు సాగేవని అప్పటి తరం వారు పేర్కొంటున్నారు. ఇప్పటికీ దుమ్ముగూడెంలో ఆనాటి రవాణా వ్యవస్థకు గుర్తుగా కాలువలు ఉండటం విశేషం. ఈ లాంచీల్లో నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, ఇతరత్రా సరుకులు లాంచీల్లో రాజమండ్రి నుంచి తెచ్చేవారు. అలాగే ఏజెన్సీ ప్రాంతం నుంచి వ్యాపారులు కలప, అటవీ ఉత్పత్తులను రాజమండ్రికి తరలించి మార్కెట్‌లో విక్రయించేవారు.

ఆచరణలోకి వచ్చేదెన్నడు ?

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని జలవనరులపై జలమార్గాలపై కేంద్ర ప్రభుత్వం 2013లో దృష్టిసారించింది. ఇందులో భాగంగా గోదావరి నదిపై భద్రాచలం నుంచి కుక్కునూరు మీదుగా రాజమండ్రి వరకు 171 కి.మీలతో పాటు, ఏలూరు కెనాల్-రాజమండ్రి నుంచి విజయవాడ వరకు, ఇందులో గోదావరి-ఏలూరు కెనాల్ (రాజమండ్రి నుంచి ఏలూరు)74 కి.మీ, కృష్ణా-ఏలూరు కెనాల్ (ఏలూరు నుంచి విజయవాడ) 65కి.మీ మేర జలరవాణా మార్గానికి సుగమం చేయాలని భావించారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని అప్పట్లో కేంద్రం పేర్కొంది. ఇందుకోసం 2013 ఏప్రిల్‌లో రూ.కోటి ఖర్చుచేసి సర్వే సైతం నిర్వహించారు. ఈ సర్వేను ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నెల రోజులపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాలోని వరరామచంద్రాపురం, కూనవరం, వేలేరుపాడు, కుక్కునూరు గోదావరి పరివాహక ప్రాంతాల్లో అధ్యయనం చేశారు. గోదావరి లోతు, అడుగున ఉన్న ఇసుక, రాళ్లు, గోదావరి ప్రవాహ వేగాన్ని తెలుసుకునేందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. జీపీఎస్, హైడ్రోలాజికల్, టోపోగ్రాఫికల్ పద్ధతుల ద్వారా ఈ సర్వేను నిర్వహించారు. అన్ని సర్వేలు పూర్తిచేసి గోదావరి జలమార్గం సాధ్యమేనని అధికారులు తేల్చారు. కానీ, ఈ ప్రాజెక్టు ఇంతవరకు ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోదావరి జలమార్గంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన పీసీసీ అధ్యక్షుడు

- రైతుపండుగ విజయవంతం చేసినందుకు అభినందనలు



మంత్రి తుమ్మలతో పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌గౌడ్

ఖమ్మం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌గౌడ్ ఆదివారం హైదరాబాదులో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. మహబూబ్‌నగర్‌లో రైతు పండుగ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించినందుకు, మూడురోజులపాటు కార్యక్రమాలను పర్యవేక్షించి స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, యాంత్రీకరణపై అవగాహన కల్పించినందుకు తుమ్మలకు పీసీసీ అధ్యక్షుడు అభినందనలు తెలిపారు. అలాగే రైతురుణమాఫీ, రైతుభరోసా విషయంలో చూపించిన చొరవను కొనియాడారు. ఆదర్శ రైతే వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నందుకు తమకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా తన ఇంటికి వచ్చిన పీసీసీ అధ్యక్షుడిని మంత్రి తుమ్మల శాలువాతో సత్కరించారు.

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10-30కి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి చేరుకుంటారు. మధ్యాహ్నం 2.00గంటల వరకు టేకులపల్లి మండలంలో పర్యటిస్తారు. సాయంత్రం 4-30గంటలకు నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో సీసీ రోడ్డుకు, సాయంత్రం 5.00 గంటలకు కొత్తకొత్తూరులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం నేలకొండపల్లి మండల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తారు. సాయంత్రం 5-30 గంటలకు భైరవునిపల్లి, 6.00 గంటలకు రాయిగూడెం, 6-30 మంగాపురంతండా గ్రామాల్లో పర్యటించి సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి పర్యటనకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సాయితేజ మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు

- తానా టీం స్క్వేర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్

ఖమ్మం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అమెరికాలోని చికాగో సమీపంలోని కాంకాడ్సి యూనివర్శిటీలో చదువుతూ ఓ స్టోర్‌లో దుండగుల తుపాకీ కాల్పుల్లో మృతిచెందిన ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థి నూకారపు సాయితేజ మృతదేహాన్ని ఖమ్మం రప్పించేందుకు తానా టీంస్క్వేర్ కృషిచేస్తోందని ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు (తానా) శృంగవరపు నిరంజన్, మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇప్పటికే తానా టీంస్క్వేర్ బృందం మృతదేహాన్ని పరిశీలించారని, శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో మృతదేహం పంపించే కార్యక్రమానికి అంతరాయం ఏర్పడిందన్నారు. సెలవుల కారణంగా అవసరమైన ధ్రువ పత్రాలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం సాయితేజ మృతదేహం మార్చురీలోనే అన్ని జాగ్రత్తలతో భద్రపరచడం జరిగిందని సోమవారం నుంచి మృతదేహాన్ని ఇండియాకు తీసుకొచ్చేందుకు అవసరమైన అనుమతులు తీసుకుని సాధ్యమైనంత త్వరగా మృతదేహాన్ని ఖమ్మం తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. కాల్పుల ఘటన దురదృష్టకరమని, అమెరికాలో చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తానా ఆధ్వర్యంలో విదేశీ విద్యార్థులకు సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు ఇస్తున్నామని అయినా.. కొన్ని సందర్భాల్లో ఆకస్మికంగా దుండగుల చర్యల కారణంగా చదువుకోడానికి వచ్చి విద్యార్థులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



పడకేసిన పర్యాటకం

- మంత్రాల హామీలు నీటిమూటలేనా...?
- గత వైభవం తిరిగి వచ్చేనా

6

ములుగు ఎన్‌కౌంటర్‌తో హైఅలర్ట్

- భద్రాద్రి జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు
- చర్ల, వెంకటాపురం ప్రాంతాల్లో జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సన్నాహాలు
- నేటినుంచి పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పెరిగిన కూంబింగ్

వివరాలు : 6లో



వణికిస్తున్న వాన భయం

- 'పెంగల్' తుఫాన్‌తో జిల్లాలో పలుచోట్ల జల్లులు
- ఆందోళనలో వరి, పత్తి రైతులు
- పలుచోట్ల కల్లాల్లో తడిచిన ధాన్యం

వివరాలు : 6లో





ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా

రామాలయంలో ప్రత్యేక పూజలు

- గోపూజలో పాల్గొన్న దేవస్థానం ఈవో
- సువర్ణ పుష్పార్చన విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం

6

భద్రాద్రికి ఏపీ టీడీపీ నేతల పాదయాత్ర

- చంద్రబాబు సీఎం కావాలని రామయ్యకు మొక్కిన విశాఖపట్నం కార్పొరేటర్
- నెరవేరడంతో మొక్కు తీర్చుకున్న నేతలు
- మొత్తం 370 కి.మీలు సాగిన పాదయాత్ర

భద్రాచలం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి భద్రాద్రి రామయ్య చెంతకు ఏపీ టీడీపీ నాయకులు నిర్వహించిన పాదయాత్ర ఆదివారం భద్రాచలం చేరుకుంది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ విశాఖ టీడీపీ కార్పొరేటర్ కాకి గోవిందర్‌రెడ్డి భద్రాద్రి రామయ్యకు మొక్కుకున్నారు. చంద్రబాబు సీఎం కావడంతో తన మొక్కును తీర్చుకునేందుకు కాకి గోవిందర్‌రెడ్డి నవంబరు 20న విశాఖ జిల్లాలోని తన స్వగ్రామమైన తుగ్లాం నుంచి 30 మంది సహచరులతో పాదయాత్రగా భద్రాచలం బయలుదేరారు. ఈ క్రమంలో 370 కిమీ. పాదయాత్ర నిర్వహించి ఆదివారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి సన్నిధికి చేరుకున్నారు. రామాలయంలో చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి తమ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, చంద్రబాబు పాలనలో ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని కోరుకున్నట్లు నాయకులు తెలిపారు. అంతకు ముందు భద్రాచలం వస్తున్న విశాఖపట్నం టీడీపీ నాయకులకు బూర్గంపాడు మండలం సారపాక వద్ద స్థానిక ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు సంఘం నేత కనకమేడల హరిప్రసాద్, పోటు రంగారావు, టీడీపీ నాయకులు కాకర్ల సత్యనారాయణ, కర్రి మాధవిలత స్వాగతం పలికారు. ఈ పాదయాత్రలో ఏపీలోని వివిధ జిల్లాల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాష్ట్రంలోని తెలుగుదేశం నాయకులు సహకరించి స్వాగతం పలికారని వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు విశాఖపట్నం కార్పొరేటర్ కాకి గోవిందర్‌రెడ్డి తెలిపారు.



భద్రాద్రి రామాలయంలో టీడీపీ నేతల బృందం

పడకేసిన పర్యాటక కేంద్రం



నిరుపయోగంగా ఉన్న పర్యాటక కేంద్రంలోని భవనం

» మంత్రుల హామీలు నీటిమూటలేనా...? » గత వైభవం తిరిగి వచ్చేనా

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుష్కర కాలం నుంచి వైరా రిజర్వాయర్ పర్యాటక కేంద్రం పడకేసింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో రిజర్వాయర్ ప్రాంతంలో పర్యాటక కేంద్రం కళకళలాడింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు పాల కులు పర్యాటక కేంద్రంపై శీతకన్ను వేశారు. ఫలితంగా ఈ పర్యాటక కేంద్రం పూర్తిగా ఆనవాలు కోల్పోయింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల్లోని పర్యాటకశాఖ మంత్రులు వైరా రిజర్వాయర్ పర్యాటక కేంద్రాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకే తలమానికంగా తీర్చి దిద్దుతామని చేసిన ఆర్భాట ప్రకటనలు గాలి మాటలుగానే మిగిలిపోయాయి.

గతమెంతో ఘనం..

ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాగా ఉన్న సమయంలో తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో వైరా రిజర్వాయర్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెంది కళకళలాడింది. మొదట టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక కేంద్రం అభివృద్ధికి బీజం పడింది. 2002 అక్టోబరులో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వైరా రిజర్వాయర్‌ను సందర్శించి బోడేపూడి సుజల స్రవంతి మంచినీటి పథకాన్ని ప్రారంభించిన తర్వాత రూ.పదిలక్షలతో పర్యాటక కేంద్ర అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ఆ నిధులతో రిజర్వాయర్ గుట్టల మధ్య రోప్‌వే నిర్మించాలని తలపెట్టినా అది కార్యరూపం దాల్చలేదు. అయితే ఇతర పనులు మాత్రం చేశారు. ఇక ఆతర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర పర్యాటకశాఖ మంత్రి రేణుకాచౌదరి పర్యాటక కేంద్రం అభివృద్ధికి రూ.కోటికిపైగా నిధులు మంజూరు చేశారు. పర్యాటక అభివృద్ధికి రేణుకాచౌదరి శంకుస్థాపన చేసి పనులు పూర్తయ్యాక ఆమే ప్రారంభించారు. ఐదారేళ్ల పాటు రిజర్వాయర్ పర్యాటక కేంద్రంగా విరాజిల్లింది. రూ.కోటితో ఫౌంటెన్‌లు, ఎంట్రీ ప్లాజా, ఫుట్‌పాత్, పచ్చదనం, రెయిలింగ్, లైటింగ్, చిన్నారులు ఆడుకునేలా క్రీడా వసతులు, రెస్టారెంట్ భవనాన్ని నిర్మించారు. బోట్ షికారు కూడా ఏర్పాటుచేశారు.

నిలిచిన బోటు షికారు...

వైరా రిజర్వాయర్‌లో స్పీడ్ బోటు, పెడల్ డీలక్స్ బోట్లు నడిపి పర్యాటకులను గంగపుత్ర యూత్ వారు ఆకర్షించారు. రెండు సంవత్సరాల నుంచి ఈ బోట్లు మూలనపడి శిథిలమై పోతున్నాయి. సెలవు దినాలు, పండుగల సమయాల్లో బోటింగ్ కోసం వివిధ ప్రాంతాల నుంచి వందలాదిమంది వైరా పర్యాటక కేంద్రానికి వచ్చేవారు.

కంటితుడుపుగా ట్యాంకుబండ్ అభివృద్ధి

బీఆర్ఎస్ హయాంలో రూ.నాలుగున్నర కోట్లతో వైరా రిజర్వాయర్ ఆనకట్ట సుందరీకరణలో భాగంగా కంటితుడుపుగా అభివృద్ధి చేశారు. ఆనకట్ట వెడల్పు చేసి బతుకమ్మ ఘాట్ నిర్మించి రూ.31లక్షలతో సోలార్ లైట్లు ఏర్పాటుచేసి పచ్చగడ్డి పరిచారు. ఈ ఆనకట్ట మొత్తం పచ్చగడ్డి స్థానంలో పిచ్చి, కంపచెట్లతో నిండిపోయి ఉంది. దాదాపు 45 సోలార్ లైట్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి బ్యాటరీలను అపహరించుకుపోయారు. ఆనకట్ట పక్కన రెయిలింగ్ నిర్మించినా కనీసం రంగులు కూడా వేయలేదు. సిమెంట్ ప్లాస్టింగ్‌తోనే కళాహీనంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో నాటి పర్యాటక మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వైరా రిజర్వాయర్‌ను సందర్శించి అదనపు బోట్లు నడిపే పేరిట హడావుడి చేశారు. పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు కోట్లరూపాయల నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. ఈ ఏడాది ఆగస్టు 13న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వైరా పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. పర్యాటక కేంద్ర అభివృద్ధిలో భాగంగా వైరా నుంచి రిజర్వాయర్ అలుగుల గుండా రెడ్డిగూడెం మీదుగా తల్లాడ జాతీయ రహదారి వరకు ఒక రోడ్డు నిర్మిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా రాష్ట్రంలోనే అన్ని పర్యాటక కేంద్రాలను తలదన్నేలా వైరా పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇది జరిగి నాలుగునెలలు గడుస్తున్నా ఇంతవరకు అతీగతీ లేదు.

ఆనవాళ్లు కోల్పోయిన కేంద్రం...

వైరా రిజర్వాయర్ పర్యాటక కేంద్రం 2014తర్వాత కాలక్రమంలో తన ప్రాభవాన్ని కోల్పోయింది. రెస్టారెంట్ పూర్తిగా మూతపడింది. పచ్చదనం ఆనవాలు కూడా కన్పించటం లేదు. ఫుట్‌పాత్ పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయింది. ఫౌంటెన్‌లు, రెయిలింగ్, టైల్స్ పూర్తిగా విరిగి పగిలిపోయాయి. లైటింగ్ స్తంభాలు కన్పించటం లేదు.



వెలగని సోలార్ దీపం, పిచ్చిమొక్కలతో ఉన్న ఫుట్‌పాత్



పవిత్ర గోదావరి జలకలశాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మలింగేశ్వర స్వామికి జలాభిషేకం

పాల్వంచ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ చింతలచెర్వు శ్రీ ఆత్మలింగేశ్వర స్వామివారికి 1008 పవిత్ర గోదావరి జలకలశాలతో అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజు సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు జితేందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త మచ్చ శ్రీనివాసరావు, దంపతుల నేతృత్వంలో నిర్వహించిన ఈ అభిషేక మహోత్సవానికి జాతీయ అయ్యప్పసేవాసమితి బాధ్యులు రాజ్‌దేశ్ పాండే, గొల్లగూడెం సాయి సత్సంగం సేవకులు గాజర్ల వీరభద్రంతో పాటు వేలాది మంది భక్తులు తరలివచ్చి జలాభిషేకంలో పాల్గొన్నారు. ఆలయంలో అయ్యప్ప స్వాములు అయ్యప్పభజన చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

పెనుబల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పెనుబల్లిలో టీఎస్ యూటీఎఫ్ 11వ మండల మహాసభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒక డీఏ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని, మిగిలిన డీఏలను విడుదల చేయాలని కోరారు. నూతన పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నాగ మల్లేశ్వరరావు

ఫుట్‌బాల్ పోటీల విజేత కొత్తగూడెం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫుట్‌బాల్ పోటీల విజేతగా కొత్తగూడెం జట్టు నిలిచింది. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్లో కొత్తగూడెం జట్టు భద్రాచలం జట్టు పై 1-0 ఆధిక్యంతో విజయం సాధించింది. ఈ పోటీలు రెండు రోజులపాటు నిర్వహించగా భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, చర్ల, కుంట, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో విజేతగా కొత్తగూడెం జట్టు నిలిచింది.

భగవద్గీతతో

ఉన్నత వ్యక్తిత్వం

విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సత్యం

ఖమ్మం సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఠనాన్ని చిన్నతనం నుంచే అలవరచుకుంటే ఉత్తమ పౌరులుగా తయారవుతారని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి గుమ్మల్ల సత్యం అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాలలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత అభ్యాసనం వల్ల ఉన్నత వ్యక్తిత్వం సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా నాయకులు బోనాల రామకృష్ణ, కృష్ణ, రవి, ఇస్కాన్, తదితర భక్త బృందాలు పాల్గొన్నాయి.

ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా

రామాలయంలో ప్రత్యేక పూజలు

» గోపూజలో పాల్గొన్న దేవస్థానం ఈవో

» సువర్ణ పుష్పార్చన విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం

భద్రాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్న క్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనునారు. ఈ క్రమంలో తొలి రోజైన ఆదివారం గోశాల వద్ద తొలుత గోపూజను దేవస్థానం వైదిక సిబ్బంది నిర్వహించగా ఈవో ఎల్. రమాదేవి పాల్గొన్నారు. అనంతరం వేద పారాయణం, సువర్ణ పుష్పార్చన శ్రీ సీతారామచంద్రస్వామి వారికి నిర్వహించారు. ఆలయ పండితులతో ప్రవచనం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజా పాలన విజయోత్సవాల క్రమంలో పూజా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు దేవస్థానం ఏఈవో వి.శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో, పర్యవేక్షకులు బి.కిషోర్, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, శ్రీరామాయణపారాయణదారు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచారి, మృదంగ వాయిద్య కళాకారులు ఎస్.శ్రీనివాసరావును నియమించారు. ఈ తొమ్మిది రోజుల పాటు తాత్కాలిక విద్యుత్ దీపాలంకరణ, పూల అలంకరణ ఏర్పాట్లు చేశారు. చిత్రకూట మంటపంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఈవో రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కూచిపూడి నృత్యాన్ని వరలక్ష్మి, కొండల్‌రావు శిష్య బృందం ప్రదర్శించారు. దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.



గో పూజలో పాల్గొన్న దేవస్థానం ఈవో

ములుగు ఎన్‌కౌంటర్‌తో హైఅలర్ట్

» భద్రాద్రి జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు

» నేటినుంచి పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పెరిగిన కూంబింగ్



చర్ల మండల సరిహద్దు లో కూంబింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో శనివారం అర్ధరాత్రి జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. గస్తీ ముమ్మరం చేశారు. సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి మావోయిస్టులు జిల్లా సరిహద్దులోకి రాకుండా కట్టడి చేసేందుకు భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. ములుగు జిల్లా సరిహద్దు ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలోని పినపాక, కరకగూడెం, ఏడుళ్లబయ్యారం, గుండాల, ఆళ్లపల్లి, ఇల్లెందు అడవుల్లో పోలీసులు కూంబింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని చర్ల, దుమ్ముగూడెం, గోదావరినదీ పరివాహక ప్రాంతాల్లోనూ పోలీసు బలగాలను మోహరించారు. భద్రాద్రి జిల్లా చర్ల, ములుగు జిల్లా వెంకటాపురం ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలను అణిచివేసేందుకు జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ రెండు జిల్లాల సరిహద్దుల్లో కూంబింగ్ ముమ్మరం చేశారు.

పీఎల్‌జీఏ వార్షికోత్సవాలతో అప్రమత్తం

పీఎల్‌జీఏ (మావోయిస్టు ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం) వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పోలీసులు కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సరిహద్దు ప్రాంతాలతో పాటు వంతెనలు, కాల్వలు ఉన్నచోట బాంబ్‌స్క్వాడ్‌తో తనిఖీలను ముమ్మరం చేశారు. ఇప్పటికే మవోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జాయింట్ టాస్క్‌ఫోర్స్ యూనిట్ ఏర్పాటు చేయాలని కేంద్రహోంమంత్రి అమీత్‌షాను ఢిల్లీలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలోనే వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేసేందుకు ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దు కలిగిన రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేసేలా జాయింట్ టాస్క్‌ఫోర్స్ యూనిట్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గచ్చీబౌలి జిల్లాలో జేపీఎఫ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాయి. ఇదే తరహాలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో జేపీఎఫ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ పోలీసులతో పాటు సెంట్రల్ రిజర్వ్, సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌డీ దళాలు ఈ యూనిట్ల కింద పని చేయనున్నాయి.

ములుగు జిల్లా వెంకటాపురం, భద్రాద్రి జిల్లా చర్ల మండలాల్లో సమీపంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న కర్రెగుట్టలు మావోయిస్టులకు అడ్డాగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు పట్టు సాధించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్న తరుణంలో ఆదిలోనే వారికి చెక్ పెట్టేందుకు చర్ల మండలం కొండవాయి, వెంకటాపురం మండలం ఆసుపాకలో జీపీఎఫ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలంలో సీఆర్‌పీఎఫ్ క్యాంపు బెటాలియన్లు 14 వరకు పని చేస్తున్నాయి. వీటిలో సుమారు ఐదున్నర వేల మంది జవాన్లు మావోయిస్టు కార్యకలాపాలను అణచివేసే విధుల్లో ఉన్నారు. మొత్తం మీద సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బలగాలు భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

వణికిస్తున్న వాన భయం

» 'పెంగల్' తుఫాన్‌తో జిల్లాలో పలుచోట్ల జల్లులు

» ఆందోళనలో వరి, పత్తి రైతులు

» పలుచోట్ల కల్లాల్లో తడిచిన ధాన్యం

ఖమ్మం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ 'పెంగల్' తుఫాన్ ప్రభావం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై చూపుతోంది. జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల జల్లులు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం నుంచే వాతావరణం చల్లబడి చలిగాలులు వీస్తుండంతో రైతులు కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని రాసులుగా పోసి టార్పాల్స్ కప్పారు. ఆదివారం పలు మండలాల్లో వర్షం కురిసంది. వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, కొణిజర్లతో పాటు పలు మండలాల్లో జల్లులు కురిశాయి. జిల్లాలో ఒకవైపు వరికోతలు ముమ్మరంగా జరుగుతుండగా మరోవైపు పత్తి కొనుగోళ్లు కూడా సాగుతున్నాయి. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి తేమ కారణంగా ఇప్పటికే రైతులు ఇబ్బంది పడుతుండగా మబ్బులు, జల్లులతో పంటలో మరింత తేమ పెరిగే పరిస్థితి నెలకొంది. పొలాల్లో ఏరకుండా ఉన్న పత్తి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. కోతకు వచ్చిన వరిచేలు నేలకొరిగి ధాన్యం నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది. ప్రస్తుతానికి చిరుజల్లులే కురుస్తున్నా వర్షాలు అధికమైతే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల జల్లులు కురిశాయి.



వైరా ఏఎంసీలోని ధాన్యం రాశుల్లో నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

లారీలోని డీజిల్, సామగ్రి చోరీ

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరాలో నిలిపి ఉంచిన ఓ లారీ నుంచి డీజిల్, ఈసీఎం మిషన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఆమేరకు బాధితుడు దేవిశెట్టి సైదులు ఆదివారం వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లారీ ట్రాన్స్‌పోర్టు నిర్వహించుకొని జీవనోపాధి పొందుతున్న సైదులు కొంతకాలంగా సరైన కిరాయిలు లేక తన లారీ టీఎస్04యూసీ8234ను సీఎస్ఐ చర్చి సమీపంలో నిలిపి ఉంచాడు. తన లారీని ఆదివారం స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా 200లీటర్ల డీజిల్ ట్యాంకులోనిది చోరీకి గురైనట్లు తేలింది. డీజిల్ పోసుకొని మళ్లీ స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. ఆవెంటనే మెకానిక్‌ను తీసుకొని వచ్చి చూపించగా ఈసీఎం మిషన్ చోరీకి గురైనట్లు బయటపడింది. డీజిల్, మిషన్ విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కత్తితో బెదిరించి దోపిడీ

తల్లాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తండ్రి, కుమార్తెను గుర్తుతెలియని దొంగలు కత్తితో బెదిరించి చోరీకి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తల్లాడ మండలంలోని మిట్టపల్లి గ్రామంలో 80ఏళ్ల వృద్ధుడు మువ్వా సూర్యనారాయణ, ఆయన కుమార్తె 55ఏళ్ల విజయకుమారి ఇంట్లో నిద్రిస్తున్నారు.

ఈ సమయంలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి వచ్చి తండ్రి కుమార్తెను కత్తితో బెదిరించి రూ.40వేలు నగదును దోచుకెళ్లారు. సూర్యనారాయణ కుమారుడు మువ్వా శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఉర్సేషరీఫ్ ఉత్సవాలు



గుర్రాల బగ్గీలో నాగూల్ మీరా నిషానీ

» కన్నుల పండువలా జులూస్

» ఇల్లెందులో వెల్లివిరిసిన మత సామరస్యం

» పలు జిల్లాలనుంచి తరలివచ్చిన భక్తులు

ఇల్లెందు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలోని నెం2 బస్తీ హజరత్ ఖాసీమ్ దుల్హా దర్గా షరీఫ్ నుంచి ఆదివారం ఉదయం ప్రారంభమైన జులూస్ పట్టణంలోని పాత బస్టాండ్, జగదాంబసెంటర్, ఆమ్ బజార్, కొత్తబస్టాండ్, సత్యనారాయణ పురం, మీదుగా అటవీ ప్రాంతంలోని హజరత్ నాగూల్ మీరా దర్గాకు చేరుకుంది. దాదాపు 10 కిలోమీటర్ల పొడవున సాగిన ఈ ఊరేగింపులో భిన్న మతాలకు చెందిన ప్రజలు భక్తి ప్రవృత్తులతో పాల్గొన్నారు. జులూస్ అగ్రభాగాన ఒంటెలపై హజరత్ పతాకాలను ప్రదర్శిస్తూ, గుర్రాల బగ్గీల్లో నాగూల్ మీరా నిసానీ, హజరత్ నిశానీలను ప్రతిష్ఠించి ఊరేగించారు.

జులూస్‌లో కేరళా వాయిద్యకారులు, ముంబై నుంచి వచ్చిన కళాకారులు ఆంధ్రప్రదేశ్ వాయిద్యకారులు జులూస్‌లో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. జులూస్ సత్యనారాయణపురం దర్గాకు చేరుకున్న తరువాత వేలాదిమంది భక్తులు మాలిక్ దర్గా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో హజరత్ నాగూల్ మీరాకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి వేలాది ప్రజలు తరలివచ్చారు.



జులూస్‌లో అయ్యప్ప మాలాధారులు



ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా హజరత్ నిషానీలు

ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా

హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్‌ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూవిస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పనులు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్‌ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది.. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్లు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించినట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు!

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్‌ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో

రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు టాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్టు షికా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్టు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్టు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షికా గోయల్ సూచించారు.

క్రైం సమాచారం

పుణ్యక్షేత్రానికి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడి మృతి.. ఇద్దరికి గాయాలు
- ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన గుర్తుతెలియని వాహనం
- సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ సమీపంలో ఘటన





ప్రమాద స్థలంలో క్షతగాత్రులు, యశ్విత్(ఫైల్)

సత్తుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పుణ్యక్షేత్రానికి బయల్దేరిన కొద్ది నిమిషాలకే ఆ కుటుంబానికి శోకం మిగిలింది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇరువురి గాయాలైన సంఘటన ఆదివారం సత్తుపల్లి మండలంలో చోటుచేసుకుంది. సత్తుపల్లి ఎస్ఐ రఘు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఊకే రాజు, స్వరూపరాణి దంపతులు కుమారుడు యశ్విత్ (4)తో కలిసి ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి వస్తున్నారు. వీరితో పాటు అనకాపల్లి జిల్లా రోళ్లకుంటకు చెందిన సత్యభువన ప్రసాద్, రాజ్యలక్ష్మీ దంపతుల కుమార్తె నిహితలతో కలిసి మరో ద్విచక్ర వాహనాలపై సత్తుపల్లి వస్తున్నారు. ఈ క్రమంలో కిష్టారం ఓసీ సమీపంలోని మహాలక్ష్మీ క్యాంప్ వద్ద రోడ్డుపక్కన ఆగి ఉండగా మరో స్నేహితుడు ప్రతీప్‌తో మాట్లాడుతుండగా ఖమ్మం వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. రాజు, ప్రసాద్, ప్రతీప్‌లు ఓసీలోని మహాలక్ష్మీ క్యాంప్‌లో రోటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు.

అక్కడికక్కడే నాలుగేళ్ల బాలుడి..

ఈ ప్రమాదంలో యశ్విత్ (4) అక్కడికక్కడే మృతిచెందగా నిహిత, ప్రతీప్‌లకు స్వల్పగాయాలవ్వగా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కుమారుడు మృతిచెందడంతో ఆ తల్లిదండ్రుల ఆర్తనాదాలను ఎవరికీ ఆపతరం కాలేదు. సమాచారం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐలు రఘు, కవిత వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీ కొని ఫార్మసిస్ట్ దుర్మరణం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ మెడికల్ షాప్‌లో ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తున్న వ్యక్తిని లారీ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సత్తుపల్లి పట్టణ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన వివరాల ప్రకారం కల్లూరు మండలం నారాయణపురానికి చెందిన గొల్లమందల రామకృష్ణ (32) విధుల నిమిత్తం సత్తుపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. కిష్టారం ఓసీ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించిన పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మృతునికి భార్య రాజేశ్వరి, కుమార్తెలు ఆధ్యా, అయాన్షాలున్నారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి యువకుడి మృతి

పెనుబల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. గ్రామానికి చెందిన పడిగల సత్యనారాయణ(28) తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందాడు. బయటకు వెళ్లిన సత్యనారాయణ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుకులాట ప్రారంభించారు. దీపు చెరువు కట్టపై సత్యనారాయణకు సంబంధించిన చెప్పులు, స్వెట్టర్ కన్పించడంతో స్థానికులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా సత్యనారాయణ మృతదేహం లభ్యమైంది. ఘటనాస్థలానికి చేరుకున్న వీఎంబంజర్ పోలీసులు సత్యనారాయణ మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కూలీపనులు చేసుకునే సత్యనారాయణ మృతితో కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ముగిశాయి. పోటీల అనంతరం విజేతలకు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను భాగంగా చేసుకోవాలని అన్నారు. క్రీడా స్ఫూర్తితో పోటీలు పడి విజయం సాధించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. అంతే కాకుండా పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. బాలుర జట్టులో హితేష్, యశ్వంత్, గౌరవ, దుర్గామణికంఠ, నిఖిల్, ఫజల్, హరి, తరుణ్, ఉజ్వల్, సోమశేఖర్, జ్వలిత్, కేతన్, తేజ, రామసాకేత్, అభినవక్రిష్ణ, మోహిత్‌క్రిష్ణ, తమన్‌తేజ, స్థితప్రజ్ఞ, అఖిలేష్ బాలికల జట్టులో హారిక, తన్మయశ్రీ, రోజస, షైనీ, నేహ, స్పందనచంద్ర, లతిక, హర్షిత, ఉజ్వల, తేజశ్వి, అక్షయ, జవేరియ, గాయత్రి, సిరి, సుప్రియ, చంద్రికరాణి, షర్మిలారాణి, సౌమ్యశ్రీ, నవ్య, విద్యశ్రీ, కల్పకబిందు, శ్రావణి, నిషూ, స్నేహిత, ప్రియ, సంగీత, ఇందు, అఖిల ఎంపికైనట్లు తెలిపారు. వారు త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సీనియర్ న్యాయవాది చల్లా శంకర్ కన్నుమూత

ఖమ్మం లీగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది చల్లా శంకర్(71) గుండెపోటుతో ఆదివారం మరణించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టాపొందారు. 1985 నుంచి ఖమ్మంలో న్యాయవాదిగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. మొదటి నుంచి వామపక్ష విద్యార్థి నాయకుడిగా ఎదిగారు. ఆదివారం న్యాయవాదులు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, వివిధ న్యాయవాద సంఘాల న్యాయవాదులు తమ సంతాపాన్ని తెలిపారు.

మోరీలో ఇరుక్కున్న మత్స్యకారుడు

- సురక్షితంగా బయటకు తీసిన స్థానికులు



మత్స్యకారుడిని బయటకు తీస్తున్న స్థానికులు

మధిర రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం గ్రామంలో యంగల రాజు అనే మత్స్యకారుడు ఆదివారం ఉదయం గ్రామసమీపంలోని రొంపిమళ్ల క్రాస్ రోడ్డు వద్దగల వాగు మోరీ వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం వాగు మోరీ వద్దకు దిగిన క్రమంలో ప్రమాదవశాత్తూ మోరీలో ఇరుక్కుపోయాడు. దీంతో అతడు కేకలు వేయడంతో చుట్టూపక్కల వాసులు తక్షణమే స్పందించారు. గ్రామంలోకి పలువురికి సమాచారం అందించడంతో గ్రామస్థులు అక్కడకు చేరుకొని మోరీలో ఇరుక్కుపోయిన రాజును రక్షించేందుకు బయటకు తీసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. రెండు జేసీబీలు తీసుకువచ్చి వాగు మోరీ వద్ద రెండు గుంటలు తీసి రెండుగంటలపాటు శ్రమించి మోరీలో ఉన్న రాజుని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గ్రామస్థులు మోరీలో ఇరుక్కుపోయిన రాజును బయటకు తీయడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి వ్యవసాయ కూలీ ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎడ్ల సత్యనారాయణ (40) కూలీ పనులు చేస్తుంటాడు. పురుగుమందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లడంగా బంధువులు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య ఇందిర, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

కొలిక్కిరాని జంట హత్యల కేసు

- అనుమానితుడి ఫొటో విడుదల చేసిన పోలీసులు



పోలీసులు విడుదల చేసిన అనుమానితుడి ఫొటో

నేలకొండపల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన వృద్ధదంపతుల జంట హత్య కేసు నేటికీ ఓ కొలిక్కి రాలేదు. జంట హత్యల కేసు ఛేదనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు అందివచ్చిన ఏ అవకాశాన్ని వదలటం లేదు. నేలకొండపల్లిని జల్లెడ పట్టటంతో పాటుగా ఏడు బృందాలు హంతకుల కోసం వేటను కొనసాగిస్తున్నాయి. జంట హత్యలు జరిగిన మూడు రోజుల తర్వాత హతురాలి సెల్‌ఫోన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే ఓ ఆటోమొబైల్ షాపు ఎదురుగా దొరకటం కలకలం సృష్టించింది. పోలీస్ స్టేషన్ సమీపంలోనే హతురాలి సెల్‌ఫోన్‌ను పడవేసి హంతకులు పోలీసులకు మరో సవాల్ విసిరారు. సాధ్యమైనంత త్వరగా కేసును ఛేదించాలన్న ధృఢమైన లక్ష్యంతో పోలీసులు ముందుకు సాగుతున్నారు. హతురాలి మొబైల్ పడేసిన షాపులో ఉన్న సీసీ కెమెరాల్లో ఓ ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు మొబైల్‌ను విసిరేసినట్లుగా కనిపిస్తున్నది. ఆ సీసీ ఫుటేజీని తీసుకున్న పోలీసులు సదరు వ్యక్తి కోసం గాలిస్తున్నారు. సీసీ కెమేరాలో పడిన ద్విచక్రవాహనంపై వ్యక్తి ఫోటోను అన్ని గ్రూపుల్లోకి పోలీసులు వైరల్ చేస్తున్నారు. అనుమానితునిగా భావిస్తున్న సదరు వ్యక్తి గురించి తెలిస్తే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు లేదా ఏసీపీ రూరల్ సబ్ డివిజన్, 8712659124కు గానీ, సీఐ కూసుమంచి 8712659132కు గానీ, ఎస్ఐ, నేలకొండపల్లి 8712659138 నెంబర్లకు గానీ సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. వివరాలు అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు ప్రకటించారు. సీసీ కెమెరాకు చిక్కిన అనుమానితునిగా భావిస్తున్న వ్యక్తి ఫోటోను ఆదివారం పోలీసులు విడుదల చేశారు. జంట హత్యల కేసు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. అంతే గాకుండా నేలకొండపల్లి పోలీసులకే గాకుండా జిల్లా పోలీస్ యంత్రాంగానికే సవాల్‌గా మారింది.



కుటుంబ సభ్యుల చెంతకు.. తప్పిపోయిన వ్యక్తి

ఖమ్మంఖానాపురం, హవేలిడిసెంబరు1(ఆంధ్రజ్యోతి): నగరంలోనిఅన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతూ వైద్యసేవల అనంతరం ఆ వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం మండలం రామచంద్రాపురానికి చెందిన నిత్య నరసింహారావు విజయవాడలో తప్పిపోయాడు. మతిస్థిమితం కోల్పోవడంతో అక్కడ నుంచి కల్లూరు చేరుకొని రోడ్లపై తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఖమ్మం అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. వైద్యసేవల అనంతరం కోలుకొని వివరాలు వెల్లడించటంతో ఆదివారం భార్య సరోజిని, కుమారుడు ఉదయ్ కిరణ్, వరప్రసాద్‌లకు నరసింహారావును అప్పగించారు.



ప్రజాపాలన వేడుకలకు జడ్పీ ముస్తాబు

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ కార్యాలయాన్ని అధికారులు విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. ఆదివారం నుంచి 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



మహా పడిపూజలో మంత్రి తుమ్మల

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): నగరంలోని నిర్వహిస్తున్న మహాపడిపూజలో ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రీహరిహరసుత నిత్య అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్ రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్ తిలక్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



సింహగర్జనకు తరలిన మాలలు

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన మాలల సింహగర్జన మహాసభకు జిల్లావ్యాప్తంగా మాలలు భారీఎత్తున తరలివెళ్లారు. ఖమ్మంలో ఈ వాహనాలకు మాలమహానాడు రాష్ట్ర నేతలు దామల్ల సత్యనారాయణ, మోటపోతుల బాబురావు జడ్పీసెంటర్‌లో జెండా ఊపి ప్రారంభించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	50 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	50
బీరకాయ	58
పచ్చిమిర్చి	38
కాకరకాయ	44
బెండకాయ	24
పొట్లకాయ	48
దోసకాయ	28-48
చిక్కుడు	70
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	38
క్యాబేజీ	34
దొండ	44-50
సొరకాయ	28
క్యారెట్	68
క్యాప్సికం	58
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	185
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కేశవ చంద్రరమావత్
తిరుమల:	రోటీ కపడా రోమాన్స్
సినీ గెలాక్సీ:	జీబ్రా

డివిజన్	కార్పొరేటర్	సెల్‌నెంబర్
1	తేజావత్ హుస్సేన్	98485 29188
2	మలీదు వెంకటేశ్వర్లు	(కన్నుమూత)
3	మలీదు జగన్	95501 06299
4	దండా జ్యోతిరెడ్డి	98669 25591
5	పల్లెబోయిన భారతి	95538 53111
6	నాగండ్ల కోటేశ్వరరావు	90630 12222
7	దొంగల సత్యనారాయణ	81065 01875
8	లకావత్ సైదులునాయక్	98483 81719
9	షేక్ జాన్‌బీ	77996 85786
10	చావా మాధురి	80968 64444
11	సరిపూడి రమాదేవి	99482 78404
12	చిరుమామిళ్ల లక్ష్మీ	98493 29742
13	కొత్తపల్లి నీరజ	98483 16224
14	కూరాకుల వలరాజు	99498 97577
15	రావూరి కరుణ	92466 63945
16	మేడారపు వెంకటేశ్వర్లు	99126 44608
17	దనాల రాధా	95504 04444
18	మందడపు లక్ష్మీ	98480 18571
19	సీహెచ్ వెంకటనారాయణ	98485 88233
20	వీ ప్రశాంతలక్ష్మీ	98856 92345
21	ఆళ్ల నిరీశ	99487 14489
22	పల్లా రోశిలీనా	76599 87283
23	షేక్ మక్బూల్	98482 38953
24	కమర్తపు మురళీ	98859 74455
25	గోళ్ల చంద్రకళ	99495 29273
26	పునుకొల్లు నీరజ	94901 45220
27	దోడ్డా నాగేశ్వరరావు	88970 28299
28	గజ్జెల లక్ష్మీ	97019 23269
29	కొప్పెర సరిత	98489 41843
30	ముక్కల కమల	98483 04794
31	యర్రా గోపీ	77020 00447
32	డోనవాన్ సరస్వతి	96764 86370
33	తోటా ఉమారాణి	99511 25339
34	రుద్రగాని శ్రీదేవి	98496 34889
35	యల్లంపల్లి వెంకట్రావు	83282 18768
36	పసుమర్తి రామోహ్మన్‌రావు	98487 76665
37	షేక్ ఫాతిమాజోహారా	92465 55786
38	ఆలియా	98482 12872
39	మాధురి ప్రసాద్	98485 32871
40	దాడే అమృతమ్మ	96666 74646
41	కర్నాటి కృష్ణమూర్తి	99082 90555
42	పాకాలపాటి విజయనిర్మల	85001 65089
43	క్లైమెట్	98484 12449
44	పాలేపు విజయ	98669 25900
45	బుడిగెం శ్రీనివాస్	93993 70776
46	కర్నం వైష్ణవి	99668 66937
47	మాట్టేటి అరుణ	94403 58041
48	తోట గోవిందమ్మ	98480 15948
49	దుద్దుకూరి వెంకటేశ్వర్లు	98484 20471
50	రాపర్తి శరత్‌కుమార్	94940 43399
51	శీలంశెట్టి రమా	99492 28833
52	బుర్రి వెంకటేశ్వర్లు	99895 70941
53	పగడాల శ్రీవిద్య	94400 05558
54	మిక్కిలినేని మంజు	93969 66478
55	మోతారపు శ్రావణి	82975 49999
56	పగిడిపల్లి రోహిణి	98485 89580
57	మహ్మద్ రఫీదాబేగం	94901 88786
58	దోరేపల్లి శ్వేత	99639 07909
59	బట్టపొతుల లలితారాణి	81878 71700
60	బడ్డే నిరంజన్‌కుమార్	99667 72453

ఉల్లాసంగా .. ఉత్సాహంగా

- కార్తీకమాసం చివరి ఆదివారం వనాల్లో సందడి
- వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాలు



మాస్‌లైన్ జనభోజనాల్లో మాట్లాడుతున్న పోటురంగారావు

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో నగరంలోని పలు తోటల్లో వివిధ కుల సంఘాలు ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనం, వనసమారాధన నిర్వహించారు.

ఎన్ఆర్ఐ పేరెంట్స్ ఆధ్వర్యంలో.....

నగరంలోని చెరుకూరి మామిడితోటలో ఎన్ఆర్ఐపేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విదేశాలకు చదువు, ఉద్యోగాల రీత్యా వెళ్లేవారికి ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ సలహాలు, సూచనలు చేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని ఉద్దేశంతోనే ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఏర్పడిందన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కానూరి హిమబిందు, గౌరవాధ్యక్షుడు బత్తినేని నీరజ, ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ హనుమంతరావు పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో ....

నగరంలోని చెరుకూరి మామిడితోటలో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. తొలుత రజకకుల ఆరాధ్య దైవం మడేలయ్యా స్వామి విగ్రహానికి పూజలు, చాకలి, ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. రజకులు సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తుపాకుల యలగొండ స్వామి బీసీ సంక్షేమశాఖ అధికారి గుడికందుల జ్యోతి, పంతంగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాస్‌లైన్ ఆధ్వర్యంలో ..

నగరంలోని బల్లేపల్లిలోని మామిడితోటలో మాస్‌లైన్ జనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాస్‌లైన్‌రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. కులమతాలను వాడుకుని ప్రజలను విభజిస్తున్నారని, కులమత కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనడం నేరమన్నారు. జనభోజనాల్లో అంచనాకు మించి ప్రజలు పాల్గొన్నారన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా కళాకారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈకార్యక్రమంలో ఆవుల వెంకటేశ్వర్లు, సీవైపుల్లయ్య, అశోక్, శిరోమణి,ఝాన్సీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో

నగరంలోని గొల్లగూడెం రోడ్డులోని పొదిల వెంకటేశ్వర్లు మామిడితోటలో విశ్వబ్రాహ్మణ కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు.సంఘం రాష్ట్రఅధ్యక్ష, కార్యదర్శులు వేములవాడ మదన్‌మోహన్ సొల్లేటి కృష్ణమాచారి హాజరై మాట్లాడారు. ముందుగా గాయత్రి విశ్వకర్మ, శివలింగానికి పూజలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు ప్రారంభ ఉపన్యాసంలో మాట్లాడుతూ ఐక్యంగా వుండాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకరరెడ్డి హాజరయ్యారు. ఖమ్మంలో విశ్వ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్, విశ్వబ్రాహ్మణుల ఫెడరేషన్‌ను, ఫైనాన్స్ కార్పొరేషన్‌గా ఏర్పాటుచేసి నిధులు కేటాయించేలా మంత్రుల సహకారంతో కృషి చేస్తానన్నారు.అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో పాపాచారి, విజయగిరి సదానందచారి, వెగ్గళం శ్రీనివాసరావు,పెండోట సోమేశ్వరాచారి, వెగ్గళం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.







మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, దయాకరరెడ్డి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఖమ్మంరూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జలగంనగర్ ఉన్నత పాఠశాల్లో ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లో భాగంగా వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. రెన్యూవబుల్ ఎనర్జీ సోర్స్ అనే అంశంపై నిర్వహించిన పోటీ నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాస్ పోటీలను పర్యవేక్షించారు. ఈ పోటీల్లో జలగంనగర్ పాఠశాల విద్యార్థిని వెన్నెల ప్రథమ స్థానం, పెద్దవెంకటగిరి ఉన్నత పాఠశాల విద్యార్థిని శైలజ ద్వితీయ స్థానం, గోళ్లపాడు పోలేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.శ్రవంతి, తెల్దారుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని నేహ తృతీయ స్థానం సాధించారు. ఎంఈఓ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

కామేపల్లి: కామేపల్లి రైతువేదికలో విద్యార్థులకు 'పునరుత్పాదుక ఇందనం'పై వ్యాస రచన పోటీ నిర్వహించారు.మొదటి బహుమతి కామేపల్లి హైస్కూల్ విద్యార్థిని ఎస్‌డీ పర్వీన్, రెండో బహుమతి ఎంజేపల్లి విద్యార్థిని ఎస్‌కీర్తన, మూడోబహుమతి పొన్నెకల్ విద్యార్థి అరవింద్, గోవింద్రాల హైస్కూల్ విద్యార్థిని యోచనలకు ఎంఈవో జి.వెంకట్ బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ధర్మా, రమేష్, కమల్ సీఆర్‌పీ మోహన్ సీసీఓ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ కన్నుమూత



తిరుమలాయపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపెడ రేషన్‌షాపు డీలర్ బొల్లికొండ హనుమంతు(85) ఆదివారం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. 40ఏళ్లుగా రేషన డీలర్‌గా గ్రామంలో పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని డిప్యుటీ తహసీల్దార్ కనకం నరసింహారావు, రేషన్ డీలర్లు నివాళులర్పించారు.

కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ఖమ్మం,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):ఆదివారం సాయంత్రం వచ్చిన వర్షం కారణంగా ఓ లారీ కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వైరా వైపు నుంచి ఖమ్మంమీదుగా వెళుతున్న ఓట్యాంకర్ ఒక్కసారిగా బైపాస్‌రోడ్డులోని కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. వర్షం పడుతుండడంతో రోడ్డు సక్రమంగా కనిపించక ఢీ కొట్టినట్టు లారీ డ్రైవర్ చెప్పాడు. ఆ సమయంలో రోడ్డుమీద ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

హెచ్‌ఐవీ రహిత జిల్లాగా నిర్మిద్దాం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాను హెచ్‌ఐవీ.రహిత జిల్లాగా నిర్మించడంలో యువత పాత్ర కీలకమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖఅధికారి బి.కళావతిబాయి అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి ఎస్సార్‌బీజీఎన్నార్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి జెండాఊపి ప్రారంభించారు. హెచ్‌ఐవీ. వ్యాధిగ్రస్తులు క్రమంతప్పకుండా మందులు వాడుతూ, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని, ఆత్మస్థైర్యంతో అన్నిరంగాల్లో రాణించాలన్నారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఏఆర్టీ - ఖమ్మం,జనవాణి, జాగృతి, అప్సాప్లస్, వెఆర్జీ కేర్ లింకువర్కర్స్,క్రిస్టియన్‌సర్వీసెస్ యూనిట్, సత్యసాయి సేవాసమితి స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ ర్యాలీలో జిల్లా ప్రధాన ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్, జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి డి.రామరావు, విద్యార్థులు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, జిల్లా లీగల్ సెల్ అథారిటీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళా ప్రదర్శనలు



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఖమ్మంరూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విజయోత్సవాలు తెలియజేస్తూ నిర్వహించిన నాటక, నృత్య కళాప్రదర్శనలు దూం దాంగా కొనసాగి ఆకట్టుకున్నాయి. మండల పరిధిలోని నాయుడుపేట చౌరస్తాలోని టీసీవి.రెడ్డి ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలతో అభివృద్ధికి బాటలు, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల వద్దకే ప్రజాపాలన వచ్చిందని, సింగరేణిబొగ్గు అగ్గి మాది, ప్రభుత్వం వచ్చిన వెంటనే కొలువుల జాతర వచ్చిందని నాగరాజు సారథ్యంలో నాటక గేయ రూపంలో కళారూపాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, మైనారిటీ సంక్షేమ అధికారి కే.సత్యనారాయణ, జిల్లా యువజన క్రీడా సంక్షేమ శాఖ అధికారి సునీల్ రెడ్డి, ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో వంటల పోటీలు



మహిళలకు బహుమతులను అందిస్తున్న డీఎస్వో చందన్‌కుమార్

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రాయితీగ్యాస్‌ను సద్వినియోగించుకోవాలని జిల్లా పౌరసరఫలా శాఖ అధికారి చందన్‌కుమార్ కోరారు. ఆదివారం సింహాద్రినగర్ పెట్రోలియం భవనల్‌లో మహిళలకు "సెన్స్ ఆఫ్ డ్యూటీ క్యాంపెయిన్" కింద వంటల పోటీలను భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా హమారీ రోసయి హమారీ జిమ్మేదార్ పేరుతో మహిళలకు వంటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సురక్షితమైన ఎల్పీజీ వినియోగంపై వారు ఈ పోటీల్లో తమ ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు బహుమతులను డీఎస్వో చందన్‌కుమార్ అందచేశారు. ఈ కార్యక్రమంలో భారత్ గ్యాస్ పంపిణీదారులు ఎంవీ నగేష్, అసిస్టెంట్ మేనేజర్ సాహిల్ దోబ్లే తదితరులు పాల్గొన్నారు. మొదటి బహుమతిని పోరంకి క్రాంతి, రెండో బహుమతి కె.ఉషా, మూడో బహుమతిని జ్యోతికి అందచేశారు.

అలరించిన ఆపాత మధురాలు

భలే మంచిరోజు సంగీత విభావరిలో ఓలలాడిన అభిమానులు



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

ఖమ్మంసాంస్కృతికం,(ఆంధ్రజ్యోతి): సుధాస్ ఎంటర్ టైనమెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన భలే మంచి రోజు సంగీత విభావరి కార్యక్రమం సంగీతాభిమానులను గానామృతంలో ఓలలాడించింది. కార్యక్రమాన్ని వీక్షించి వీనుల విందు పొందేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన సంగీతాభిమానులు ఆపాత మధురాల్లో ఆసాంతం తడిచి ముద్దయ్యారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, తదితర కథానాయకులకు పాడిన పాటలను గాయకులు వినసొంపుగా ఆలపించారు. దివంగత సినీగాయకుడు ఘంటసాల జయంత్యుత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక సంగీత విభావరిలో పలు హిట్ చిత్రాల్లో ఘంటసాల ఆలపించిన పాటలను ఘంటసాల గీతాల ఫేమస్ గాయకుడు బీపీ నారాయణ తోపాటు విజయనగరం, హైద్రాబాద్, నుంచి హాజరైన గాయకులు పవన్, ఎస్‌వీ రమణ, గాయత్రి, ఐశ్వర్య, సురభి శ్రావణి తదితరులు మధురంగా ఆలపించారు.

కిటకిటలాడిన కళాక్షేత్రం

పాత పాటలు, అందునా ఘంటసాల ఆలపించిన పాటలతో నిర్వహించే సంగీత విభావరి కనుక కార్యక్రమాన్ని తిలకించేందుకు సంగీతాభిమానులు అధిక సంఖ్యలో తరలిరావటంతో కార్యక్రమం నిర్వహించిన భక్తరామదాసు కళాక్షేత్రం కిటకిటలాడింది. ఘంటసాల ఆరాధనోత్సవాల్లో భాగంగా భలే మంచి రోజు పేరుతో 27 ఏళ్లుగా నిరాటకంగా సుధాస్ ఎంటర్ టైనమెంట్స్ సంస్థ ఈ కార్య క్రమాన్ని నిర్వహిస్తోంది. కార్యక్రమాన్ని ప్రముఖ జానపద గాయకుడు కలగా కృష్ణమోహన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా ఇంద్రనోమిక సంగీత, నృత్యశిక్షణాలయం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పుస్తక ఆవిష్కరణ..

దివంగత ప్రముఖ సినీ గీత రచయిత దాశరథి కృష్ణమాచార్య సాహిత్య సేవలపై దాశరథి విజయలక్ష్మి పరిశోధన చేసి వెలువరించిన సునాద వినోదిని పుస్తకాన్ని కార్యక్రమంలో భాగంగా అడిషనల్ డీజీపీ వీవీ శ్రీనివాసరావు, ఐఆర్ఎస్ అధికారి రవిపాడి ఆవిష్కరించారు. సుధాస్ ఎంటర్ టైనమెంట్స్ నిర్వాహకులు శరగోపం సుదర్శన్, వినీల, రవి, కళ్యాణి, విజయ సారధి, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల పాటలు అజరామరం..
అదనపు డీజీపీ శ్రీనివాసరావు

ఘంటసాల పాటలు అజరామరం అని ఎంత కాలమైనా అవి పాత బడవని రాష్ట్ర అడిషనల్ డీజీపీ (టెక్నికల్) శ్రీనివాసరావు అన్నారు.. భలేమంచి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భలే మంచి రోజు కార్యక్రమంలో పాల్గొనటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాను ఖమ్మంలో ఎస్పీగా పనిచేసినప్పుడు కూడా భలే మంచి రోజు కార్యక్రమాలకు హాజరవటంతోపాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కలిగిందన్నారు. మంచి సాంస్కృతిక కార్యక్రమం వల్ల ప్రేక్షకులకు సంగీతానుభూతి కలుగుతోందన్నారు. దాశరథి కృష్ణమాచార్య జీవితంపై పరిశోధన చేసిన పుస్తకాన్ని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు.





సునాద వినోదిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు డీజీపీ శ్రీనివాసరావు, హాజరైన సంగీతాభిమానులు

ఆకాల వర్షాలు..



అన్నారుగూడెంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



కొణిజర్లలో పట్టాలపై నిలిచిన నీటిని బయటకు పోస్తున్న రైతులు

వైరా/ కారేపల్లి/తల్లాడ/మధిరరూరల్/కొణిజర్ల/ఏన్కూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్‌తో ఆదివారం సాయంత్రం వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల వ్యాప్తంగా అకాల వర్షంతో ఆరబోసిన, పోగేసిన ధాన్యం తడిసి ముద్దయింది. గత నాలుగురోజుల నుంచి ఆకాశం మేఘామృతమై ఎప్పటికప్పుడు వర్షం కురిసేలా రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న ఫెంగల్ తుఫాన్ ప్రభావం ఆదివారం పలు ప్రాంతంలో చూపించింది. రైతులు ఊహించని రీతిలో ఒక్కసారిగా వర్షం కురవడంతో ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది కొనుగోలు కేంద్రాలలో రైతులు పోసుకున్న ధాన్యం రాశులు మొత్తం తడిసి ముద్దయ్యాయి.



కారేపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పిన సిబ్బంది



మహదేవపురంలో ధాన్యాన్ని ఆరదీస్తున్న రైతు

గోరంత హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

» సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు

వైరా, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కొండంత హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో గోరంత కూడా చేయకుండా రైతు పండుగ పేరిట ఉత్సవాలు చేయటం విడ్డూరంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు విమర్శించారు. వైరా సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, పారుపల్లి కృష్ణారావు, తోట నాగేశ్వరరావు, పారుపల్లి చంద్రశేఖర్, తోట కృష్ణవేణి, పద్మ, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

» యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు

మధిర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మధిర టీవీఎం ఉన్నత పాఠశాలలో మండల శాఖ అధ్యక్షుడు వినోదరావు అధ్యక్షతన జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 14, 15తేదీలలో సత్తుపల్లిలో నిర్వహించనున్న ఆరవ జిల్లా విద్యా మహాసభలను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా, మండల సంఘం నాయకులు వల్లకొండ రాంబాబు, షేక్ నాగూర్‌వలీ, షేక్ రంజాన్, ఉద్దండు షరీఫ్, వీరయ్య, తాళ్లూరి ఆంజనేయులు, లక్ష్మణరావు, మీరాఖాన్, ఇబ్రహీం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

» సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు

పెనుబల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాను రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు ఆరోపించారు. ఆదివారం స్థానిక చలమాల సూర్యనారాయణ భవనంలో మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తడికమళ్ల చిరంజీవి, కండే సత్యం, మిట్టపల్లి నాగమణి, నలమల అరుణ్‌ప్రతాప్, చలమాల నర్సింహారావు, విశ్వనాథం, చిలకా రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో వరుస ద్విచక్ర వాహనాల చోరీ

» వారం వ్యవధిలో నాలుగు వాహనాలు మాయం

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో గత వారం రోజుల వ్యవధి కాలంలో వరుసగా విలువైన నాలుగు ద్విచక్ర వాహనాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పలు ప్రాంతాల్లో వాహనాలు చోరీకి గురవుతుండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనాల వరస చోరీల సంఘటనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. వాహనాల చోరీ సంఘటనలపై నిఘా ఉంచామని, నిందితులను పట్టుకుంటామని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

సింహగర్జనకు తరలిన మాలలు



ముదిగొండ నుంచి బయలుదేరిన మాలలు

మధిరటౌన్/ముదిగొండ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరగనున్న మాలల సింహగర్జన సభకు మధిర, ముదిగొండ నుంచి ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో నాయకులు భారీగా తరలివెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కో కన్వీనర్ ఉండేటి శ్రీను, కొమ్ము నర్సింహారావు, సీతరాములు, ఉదయ్, వెంకటేష్, నాగేశ్వరరావు తదితరులు తరలి వెళ్లారు.

జలవనరుల శాఖ కల్లూరు ఎస్ఈగా వాసంతి

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ కల్లూరు సర్కిల్ ఎస్ఈగా వాసంతి సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. బాన్సువాడ సర్కిల్ పరిధిలో ఎస్ఈగా పనిచేస్తున్న వాసంతిని కల్లూరు సర్కిల్‌కు బదిలీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా నుంచి ఈ మేరకు ఆదేశాలు వెలువడినాయి. కాగా గత అక్టోబరు నెలలో కల్లూరు ఎస్ఈగా పనిచేసిన ఆనంద్‌కుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో, ప్రస్తుతం ఇక్కడ డిప్యూటీ ఎస్ఈగా పనిచేస్తున్న ఏవీవీఎస్ నరిసింహారావు కల్లూరు ఇన్‌చార్జి ఎస్ఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం విదితమే..

ప్రజాపాలన విజయోత్సవాలకు వైరా ముస్తాబు

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ మొదటి ఏడాది ప్రజాపాలన విజయోత్సవ సంబురాలకు ముస్తాబవుతుంది. ఆదివారం రాత్రి వైరాలోని జాతీయ ప్రధాన రహదారి డివైడర్లు విద్యుత్‌దీపాల అలంకరణతో సంబురాల శోభను సంతరించుకుంది. అలాగే వైరా మునిసిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం ఇతర కొన్ని కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 3నుంచి 9వతేదీ వరకు విజయోత్సవ సంబురాలు జరుగనున్నాయి. కమిషనర్ చింతా వేణు విజయోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో ఆర్టీసీ బస్టాండ్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎంఈవో దామోదర్‌ప్రసాద్

తల్లాడ, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నారాయణపురం లూర్దుమాత పాఠశాల విద్యార్థిని తేజావత్ లహరి (ప్రథమ), బాలభారతి విద్యాలయం విద్యార్థిని సుంకర పూజిత (ద్వితీయ), బిల్లుపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.శ్రీలక్ష్మి (తృతీయ) బహుమతి సాధించారు. విజేతలకు ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్ బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు సత్తెనపల్లి శివకృష్ణ, రఘు, నవీన్ పాల్గొన్నారు.

ఏన్కూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల విద్యాలయంలో విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన వనరుల అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటీపీ సునిల్, మండలనాయకులు స్వర్ణ నరేంద్రకుమార్,మేడా ధర్మారావు, నాగేశ్వరరావు, పటాన్‌మజీద్‌ఖాన్, వరశంకరప్రసాద్ పాల్గొన్నారు.

మధిర ఏఎన్‌ఎంకు అవార్డు



డీఎంహెచ్‌వో నుంచి అవార్డు అందుకుంటున్న సంధ్య

మధిరటౌన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ ఆసుపత్రి పీపీయూనిట్ లో సీనియర్ ఏఎన్‌ఎం గా వైద్య సేవలు అందిస్తున్న పంతంగి సంధ్య ఆదివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి బాణోత్ కళావతీ బాయి చేతుల మీదగా ఉత్తమ ఏఎన్‌ఎంగా అవార్డు అందుకున్నారు. గత 28 ఏళ్లుగా వివిధ పీహెచ్‌సీలలో పనిచేసిన సేవలకు గుర్తింపుగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆమెకు అందజేశారు. అవార్డు పొందిన సంధ్యను మధిర ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ అభినందించారు.

మధిర మండల యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

మధిర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మధిర టీవీఎం హైస్కూల్‌లో జరిగిన మధిర యూటీఎఫ్ సమావేశంలో సంఘం మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా వీరయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ ఇబ్రహీం, కాజా సునీత, కోశాధికారిగా చెన్నయ్య, ఆడిటర్‌గా నిమ్మగడ్డ గోపీచంద్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎర్రుపాలెం మండలం ప్రధాన కార్యదర్శి, సీనియర్ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు వ్యవహరించారు. పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలుకాకపోతే ఉద్యమాలు

కొణిజర్ల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, వైరా సబ్‌డివిజన్ కార్యాదర్శి షేక్ ఖాసీం డిమాండ్ చేశారు. ఆదివారం గుబ్బగుర్తి గ్రామంలో జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాషా, కిషన్, దసురు, పఠాన్‌ఖాసీంఖాన్, ఉపేందర్, కృష్ణ, గంగన్న, శంకర్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

తల్లాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఎయిడ్స్‌డే సందర్భంగా ఆదివారం తల్లాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్, సూపర్‌వైజర్లు కమల, భద్రమ్మ, ఝాన్సీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు రాజశ్రీ, కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ ధనకొండ కృష్ణారావు, ఏఎన్‌ఎంలు జ్యోతి, విజయలక్ష్మీ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గంగారం డాక్టర్ ఏ.అవినాష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.



పెనుబల్లిలో ఎయిడ్స్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరాలోని క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ ఠాగూర్ విద్యాసంస్థల విద్యార్థులు ఎయిడ్స్ నివారణ ర్యాలీని నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, డైరెక్టర్ సంయోగిత, ఎన్ఎస్ఎస్ పీవో లింగారావు, అధ్యాపకులు వేణు, నరేంద్ర, చైతన్య, స్పందన, రామకృష్ణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మధిరటౌన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై అపోహలు వీడాలని డాక్టర్ పృథ్వీనాయక్ అన్నారు. ఆదివారం మధిర క్లబ్ కాంప్లెక్స్ సెంటర్‌లో పలువురికి ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు.

ఎర్రుపాలెం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎర్రుపాలెం ప్రైవేటు పాఠశాలల్లో కిండ్లే రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం ఎయిడ్స్ వ్యాధిపై సొసైటీ అధ్యక్షురాలు వేమిరెడ్డి అనూష అవగాహన కలిపించారు. ఈకార్యక్రమంలో ఎస్వీ అకాడమీ పాఠశాల హెచ్‌ఎం సతీష్‌కుమార్, మిరియాల శ్యామ్‌ప్రసాద్, ఎర్రబోలు నాగేశ్వరరావు, సొసైటీ సభ్యులు కనకపల్లి రమ్య, కృష్ణారెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెనుబల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ డే సందర్భంగా లంకాసాగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలో ఆదివారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాస్, సుగుణాదేవి, బి.నాగేశ్వరరావు, ఎంఈవో సత్యనారాయణ, కరీముల్లా, రవి, నాగమణి, మంగతాయారు, బేగం, రాణి, కృష్ణకుమారి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవలందిస్తాం

» లయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మరింతగా విస్తృత సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని లయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక సాయిబాబా మందిరంలో ఆదివారం జరిగిన లయన్స్‌క్లబ్ జనరల్ బాడీ సమావేశంలో బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ పంపిణీ చేశారు. అలాగే కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆటో కార్మికుడు నాగూల్‌మీరాకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.12,500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్.వెంకటేశ్వరరావు, ఉండ్రు శ్యాంబాబు, డి.పూర్ణచంద్రరావు, పి.ఉపేంద్రరావు, లగడపాటి ప్రభాకర్, మరికంటి రాంగోపాల్, అబ్బూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మధిర యువతికి డాక్టరేట్

మధిరటౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణానికి చెందిన విద్యార్థిని శీలం రమ్య జైపూర్ లోని జయతి విద్యాపీట్ మహిళావిశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. రమ్య తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై చేసిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ లభించింది. రమ్య తల్లిదండ్రులు శీలం శ్రీనివాస రెడ్డి విశ్రాంత ఉపాధ్యాయులు కాగా ఆమె భర్త ఎదురు కృష్ణారెడ్డి మేఘాలయ లోని మహత్మాగాంధీ యూనివర్సిటీ డీన్ గా పని చేస్తున్నారు. రమ్య కు పలువురు అభినందనలు తెలిపారు.



డాక్టరేట్ పొందిన రమ్య

ఆహ్లాదంగా సాగిన వనమహోత్సవాలు



సత్తుపల్లిలో కుర్చీలాట ఆడుతున్న ఉద్యోగులు



కారేపల్లిలో వనసమారాధనలో పాల్గొన్న మహిళలు

సత్తుపల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఆదివారం నిర్వహించిన వనమహోత్సవం సందడిగా సాగింది. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఆదివారం కమ్మ వారి కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని సంఘం నాయకులు బొప్పన రామారావు, మద్దినేని శ్రీనుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

కారేపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మున్నూరుకాపుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

సత్తుపల్లిరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ పరిషత్‌కు చైర్మన్‌ను నియమించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య మండల అధ్యక్షుడు కొడిమెల అప్పారావు కోరారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో ఆసంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనసమారాధన నిర్వహించారు.



కల్లూరులో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కమ్మ సంఘం మహిళలు

'ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి'

మధిర, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. ఆదివారం మధిరలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో జరిగిన లక్ష తులసి అర్చన సేవలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పలకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మధిర పట్టణ కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పలువురు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు విజయవంతం



బోనకల్‌లో మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

ముదిగొండ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వల్లభిలోని భక్తరామదాసు స్వచ్ఛంద సేవసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ పోట్ల కృష్ణకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తరామదాసు స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ పోట్ల ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీసత్యసాయి సేవాసంస్థలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియోపతి క్యాంప్ విజయవంతమైంది. ఈ సందర్భంగా 30మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామని, కార్యక్రమంలో డాక్టర్ తిరుపతయ్య, వెంకటేశ్వరరావు, సురేష్, తనూజ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బోనకల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. పలువురికి ఉచితంగామందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ తూము రోషన్ కుమార్, ఆకేన పవన్, బొమ్మినేని కొండలరావు, ఏలూరి పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో తల్లాడ బాలికల ప్రతిభ

తల్లాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన జిల్లాస్థాయి భవద్గీత శ్లోకాల పోటీల్లో తల్లాడ బాలికలు ప్రతిభను కనపర్చి విజేతలుగా నిలిచారు. సబ్‌జూనియర్స్ విభాగంలో తుటారి క్రిషిత ప్రథమ బహుమతి, కె.నవ్యశ్రీ తృతీయ బహుమతి సాధించారు. జూనియర్స్ విభాగంలో కె.హేమాన్విత ప్రథమ బహుమతి, వి.కీర్తన ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ కోటగిరి శ్రావణి, శ్లోకాల కంఠస్థ ఉపాధ్యాయురాలు డి.సునీత అభినందించారు.

నేడు కారేపల్లిలో ఎమ్మెల్యే రాందాస్ పర్యటన

కారేపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతోపాటు ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వైరా, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థినికి ప్రవాస భారతీయుడు కొండబోలు సురేష్‌బాబు రూ.5 వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఆదివారం గొల్లపూడిలో ఉపాధ్యాయుడు జీవీ. సూర్యప్రకాశరావు ద్వారా కరీంనగర్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న రెబ్బవరానికి చెందిన అన్నం ఉమారాణికి ఈ ఆర్థికసహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మేడూరి రామారావు, బాణాల వెంకటేశ్వరరావు, వైద్యశిబిరం నిర్వాహకులు పసుమర్తి లక్ష్మణ్‌రావు, అలాగే మేడూరి శ్రీనివాసరావు, మడుపల్లి సైదా, స్వామి, నరేష్, చవళ్ల రెడ్డి, తిరుమలి పాల్గొన్నారు.

11న నారాయణపురంలో మహా చండీయాగం

తల్లాడ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలో ఈనెల 11న మహా చండీయాగం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు కంచల సతీష్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 36హోమగుండాలతో 108మంది దంపతులచే మహా చండీయాగం నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

3న దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల అందజేత

సత్తుపల్లిరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన 50శాతం రాయితీతో ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు వలపర్ల రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డ్, సదరం సర్టిఫికేట్‌తో పాటు రెండు పాస్ ఫొటోస్‌తో సిద్దారం రోడ్‌లోని తమ ఆశ్రమానికి రావాలని కోరారు.

సీపీఎం వైరా డివిజన్ సభలను జయప్రదం చేయాలి

కొణిజర్ల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): సీపీఎం వైరా డివిజన్ మహాసభ ఈనెల 11న మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో జరుగుతుందని ఆపార్టీ జిల్లా నాయకుడు భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో మహాసభలు విజయవంతం కోరుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చింతపల్లి ప్రసాద్, రాంబాబు, హరిచంద్, సత్యానారాయణ, నంద్యానాయక్, జట్ల రవి, నరసింహరావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వాగ్దేవి కార్యవర్గం ఎన్నిక

సత్తుపల్లిరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీ.గంగారం ఎస్‌డీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పూర్వ విద్యార్థుల సంఘం వాగ్దేవి సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష,కార్యదర్శులుగా బాల నాగేశ్వరరావు, డీ.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడుగా అమరవాడి శ్రీధర్, సహాయ కార్యదర్శిగా కే.శంకరరావు, కోశాధికారిగా జీ.సత్యనారయణ, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.